# బాబోయ్ స్కూళ్ళు తెరిచారు !

స్థలం బ్రహ్మలోకం, సమయం పగలు, సృష్టికర్త సభ తీర్చి వుండగా నారదులు వారు పి.టి ఉషలాగా పరిగెత్తుకుంటూ వచ్చిన నోట మాటరాక రొప్పుతూ నిల్చుండిపోయారు. త్రిలోక సంచారి తిరిగి ఏదో చిక్కుల్లో పడ్డాడేమోనన్న అనుమానం కొద్దీ సృష్టికర్త ఏమిటి కారణం అని అడగ్గా. అందుకాయన నోటితో బదులివ్వక చేత్తోనే అటు చూడమన్నట్టుగా భూలోకం వైపుగా చూపించేడు. బ్రహ్మ సరస్వతితో పాటుగా అక్కడున్నవారంతా భూలోకం వైపుగా చూసేరు. జనం – వెర్రిజనం , ఆరుమైళ్ళ పొడుగున క్యూలో నిల్చున్నారు. ఫుల్‌సూట్ల దగ్గర నుంచి కాకీ నిక్కర్లదాకా అన్ని తరగతులు వారూ వున్నారు. క్యూలో నిల్చునే కొంతమంది కాఫీ. టీలు సేవిస్తున్నారు. కొంతమది గడ్డాలు గీయించుకుంటున్నారు. ఇంకా కొంతమంది స్నానాలు చేస్తున్నారు. ఆ పక్కనే కొద్ది మంది బట్టలు ఉతుక్కుంటున్నారు. ఆ దృశ్యం చూసేక బ్రహ్మ మూడు మొహాల్లోనూ ఆశ్చర్యం కొట్టొచ్చినట్టుగా కనిపించింది. ఎందుకీ మానవులూ అలా ఒకరి వెనుక ఒకరు నిల్చుని నడి వీధిన కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు ? వరద భాదితులా . పదవి బాధితులా ? ’ అంటూ ప్రశ్నించగా , కాదని నారదుడు అసలు సంగతి చెప్పాడు. వీరంతా తమ చిన్నారులని, బాగా పేరొందిన ఆ స్కూల్లో చేర్పించే నిమిత్తం అప్లికేషన్ ఫారమ్స్ కోసం నిల్చున్నారంటూ బ్రహ్మ అయోమయంగా సరస్వతీదేవి వంక చూడగా ఆమె విషాద వదనంతో తలొంచుకుంది. వెంటనే కట్ అన్నారు దర్శకులు. ఇది సినిమా షూటింగ్‌లో భాగం.

నిజానికి పరిస్థితి అంతకాన్న ఘోరంగానే వుంది. మా పిన్నత్త గారి కొడుకు మగ్గురు పిల్లల తండ్రి. పదిహను రోజులుగా ఇంటికి రావడంలేదంట. ఒకరోజు ఆఫీసునుంచి రాగానే కాకరకాయిలు తెమ్మని కాళేశ్వర్రావు మార్కెట్టుకి పంపించేరట. అంతేనట తిరిగొస్తే వొట్టు ఏమిపోయాడో తెలీదట. భార్యాపిల్లలు , అప్పులిచ్చిన వారు ఒకటే గోల, టీవిలో చెప్పించారు. పత్రికల్లో వేయించారు. వాళ్ళింటికి వెళ్ళినపుడు ప్రకటన చూడమని పేపరు చేతికాచ్చరు . పెళ్ళికాక ముందరి ఫోటో . మొహం తేటగా వుంది. క్రింద ఇలా వ్రాయించేరు.‘ ఏవండీ ! మీరు కాకరకాయిలంటూ వెళ్ళిన దగ్గర్నుంచి నే కళ్ళళ్ళో వొత్తులేసుకుని ఎదురు చూస్తున్నాను. కాకరకాయల కోసం కాదు.

మీ కోసం. పిల్లలు దిగులుపడ్డారు. వెంటనే ఇంటికి రండి. అమ్మాయిని మీరు చెప్పినట్లు గవర్నమెంటు స్కూల్లోనే వేద్దాం. అంటూ పారిపోయిన వానికి మెసేజ్ ఇస్తూనే పబ్లిక్కు కోసం ఇలా వ్రాసేరు. పై ఫోటోలో వ్యక్తి గత కొద్ది రోజులుగా కనిపించుట లేదు. ఎత్తు అయిదున్నర అడుగులు. నవ్వితే ఏడ్చినట్టుంటుంది. ఇంగ్లీషు, తెలుగు మాట్లాడగలరు. స్కూల్సు , కాలేజీల పేరెత్తితే కోపంతో పచ్చి బూతులు తిడతాడు. వీరి ఆచూకీ తెల్పిన వారికి ఫోర్త్ ఫారం లెక్కల టెస్టు ఫ్రీగా ఇవ్వగలము. అసలేం జరిగిందంటే – వాళ్ళమ్మాయిని డొనేషన్ల గొడవ లేకుండా గవర్నమెంటు స్కూల్లో చేర్పిద్దామంటే ఆవిడ ససేమిరా అదేదో క్రిష్టియన్ పేరుగల స్కూల్లో చేర్పించాల్సిందే అని పట్టుబట్టిందట. ఆ స్కూలు వారు అయిదువేలు డొనేషన్ పట్రమన్నారట. అంతే ! గురుడు జెండా పీకేసాట్ట. ఇలా డొనేషన్లుకట్టలేక. జెండాలు పీకలేక ఎంతమంది తండ్రులు రాత్రిళ్ళు నిద్రకాచి వర్రీ అయిపోతున్నారో అందరికీ తెలుసు. బిల్డింగు ఫండ్లు. లైబ్రరీ ఫండు, స్పెషల్ కోచింగ్ ఫండ్ , కల్చరల్ ఫండ్ వగైరా నామాంతరాలతో పేరెంట్సును పీల్చిపారెయ్యటం ఆ వ్యాపార లక్షణం. ఈ మధ్యన పబ్లిసిటీ లో ఈ స్కూళ్ళవాళ్ళు సినిమా వాళ్ళని మించిపోయేరు. పేపరు తిరగేస్తే ప్రకటనలు వీళ్ళవే ! ఒకర్ని మించి మరొకరు పోటీలు– ఆకర్షించటానికి అనేకానేక ప్రలోభాలు, పిల్లల భవిష్యత్తు గురించి భయపడే తల్లిదండ్రులు ఆదుర్దాని ఆసరగా తీసుకుని విధ్యనిని వ్యాపార రంగంగా మార్చి, చదువుని అంగట్లో కొనుక్కోవలసి వచ్చినందుకు మనం సిగ్గు పడాలి. ఆనాటి గురుకులాలు, ఆనాటి గురువులు,ఆనాటి చదువులు – తల్చుకుంటే – సరస్వతీ క్షమస్తుభ్యం ! అనాల్సిందే !

-------- అయిపోయింది --------